# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 217 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 10 జులై 2026 | పేజీలు :4




వృద్ధుల ఆరోగ్యంపై
## ప్రత్యేక శ్రద్ధ
- లయన్ డాక్టర్ లవకుమార్ రెడ్డి

3



# ఎయిమ్స్ అభివృద్ధిపై నడ్డా సమీక్ష

- **సమావేశంలో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి**




**బీబీనగర్, మన చౌరాస్తా :** బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులు, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని స్థానిక అంశాలపై చర్చించారు. అనంతరం నడ్డా, ఎంపీ చామల కలిసి ఎయిమ్స్‌లోని వివిధ విభాగాలు, వైద్య సేవలు, నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. తెలంగాణ ప్రజలకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలను త్వరగా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఎంపీ చామల తెలిపారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో బీబీనగర్ ఎయిమ్స్‌ను దేశంలోనే ఆదర్శ వైద్య సంస్థగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. సమీక్షలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, డి.కె.అరుణ, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ అగర్వాల్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎయిమ్స్ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను మీ పిల్లలుగా
## భావించండి
- కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- అత్యాధునిక సౌకర్యాల కల్పన, పౌష్టికాహారం
- విద్యార్థుల నమోదు పెరగాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

3



సర్పంచుల ఆత్మగౌరవం కోసం
## ఐక్య పోరాటం చేద్దాం..
**జనగామ జిల్లా సర్పంచుల చైతన్య సదస్సు**

3




జనగామ కెనరా బ్యాంకులో
## అగ్నిప్రమాదం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంకులో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బ్యాంకు నుంచి పొగలు, మంటలు రావడంతో స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సిఐ సత్యనారాయణ రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకొని అన్ని ప్రమాదంలోకి గల కారణాలను విచారిస్తున్నారు



# పకడ్బందీగా భూముల రీ సర్వే

- మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే
- డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ సాంకేతికతతో పారదర్శక సర్వే
- 60 రోజులకు మించి భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు
- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** భూముల రీ సర్వేను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించి ప్రతి భూమికి స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, నక్ష భూముల అంశాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనగామ సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వేను దశలవారీగా చేపడుతోందని తెలిపారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన యాజమాన్య హక్కులు నిర్ధారించడంతో పాటు ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ యూనిక్ నంబర్ కేటాయించనున్నట్లు తెలిపారు. డీజీపీఎస్ (DGPS), రోవర్స్, జీఐఎస్ (GIS) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రీ సర్వే చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, ఆయా గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులను భాగస్వాములను చేయాలని సూచించారు. రీ సర్వేలో రెగ్యులర్ సర్వేయర్లతో పాటు లైసెన్స్ డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సోమవారం నుంచి సర్వేయర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా సమగ్ర శిక్షణ నిర్వహించి అనంతరం అన్ని గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రీ సర్వే పూర్తయ్యే వరకు రెగ్యులర్ సర్వేయర్లలో 25 శాతం మందిని రొటేషన్ పద్ధతిలో విధుల్లో వినియోగించాలని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరును శాఖ సర్వేయర్లు నిరంతరం పర్యవేక్షించాలని, డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రీ సర్వే పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రీ సర్వే నాణ్యతతో నిర్వహించాలని, సర్వేలో ఉపయోగించే ఆధునిక పరికరాల వినియోగాన్ని సాంకేతికంగా పర్యవేక్షించే వ్యవస్థ అందుబాటులో ఉందని, వాటిని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రీ సర్వేలో పాల్గొనే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందజేస్తుందని తెలిపారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో అసాధారణ జాప్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, సాధారణ విధులు నిర్వహించడానికి కోర్టు ఆదేశాలు అవసరమా అని హైకోర్టు ప్రశ్నించిందని తెలిపారు. ప్రస్తుతం ప్రతి అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై హైకోర్టు వివరణ కోరుతోందని, స్పందించేందుకు నాలుగు వారాల గడువు లభించిందన్నారు. రెవెన్యూ కార్యాలయంలోనూ భూ భారతి దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, పెండింగ్ దరఖాస్తులను అత్యంత త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ వీసీ లో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ మన్యం కొండ, డి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

**కోహెడ, మన చౌరాస్తా:** విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడమే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) లక్ష్యమని సిద్దిపేట జిల్లా వసతి గృహాల కన్వీనర్ రాజేష్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోహెడ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఏబీవీపీ ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమై ప్రస్తుతం దేశవ్యాప్తంగా 78 లక్షలకుపైగా సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందిస్తోందని చెప్పారు. విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఏబీవీపీ కృషి చేస్తోందని తెలిపారు. దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న ఏబీవీపీ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ కార్యకర్త పూర్ణచంద్ర, కంది సతీష్ రెడ్డి, రాజు, వేణుతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# లంపి వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

## పశువులకు టీకాల కార్యక్రమం ప్రారంభం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** పశువులను లంపి చర్మవ్యాధి నుంచి రక్షించేందుకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామంలో గురువారం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని పాడి రైతులందరూ తమ వద్ద ఉన్న పశువులకు తప్పనిసరిగా లంపి వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ఆయన సూచించారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జూనియర్ మహిళా పశువైద్యురాలు డి. నాగారాణి మాట్లాడుతూ.. పశువుల్లో జ్వరం, చర్మంపై గడ్డలు, మేత తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడిగె శ్రీనివాస్ గౌడ్, పాడి రైతు రామంచ అశోక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.





# భారత సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ జట్టుకు జనగామ కుర్రాడు..

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన శ్రీచేతన్ శౌర్య భారత సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడు. సెప్టెంబరులో చైనాలోని చెంగ్డూలో జరిగే ఆసియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో అండర్15 డబుల్స్‌లో స్వర్ణ పతకం, సింగిల్స్‌లో రజత పతకం సాధించి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, క్రీడాభిమానులు శౌర్యకు అభినందనలు తెలియజేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 'చలో ప్రజా భవన్' విద్యార్థులు తరలిరావాలి

**హనుమకొండ, జనగామ చౌరాస్తా:** విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న నిర్వహించనున్న 'చలో ప్రజా భవన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల మనోజ్ పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతోందని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను వెంటనే పంపిణీ చేయాలని, ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వార్డెన్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. బీసీ వసతిగృహాల్లో ఆన్‌లైన్ ప్రవేశ విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా భోజన, వ్యక్తిగత అవసరాల భత్యాలను పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం చేపట్టిన 'చలో ప్రజా భవన్' కార్యక్రమానికి జిల్లాలోని విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆకుల మనోజ్ పిలుపునిచ్చారు.



# చేనేత సంఘం నూతన పాలకవర్గం

## – చైర్మన్‌గా చిటుకుల వెంకటేశ్వర్లు



**లింగాల ఘనపురం, జనగామ చౌరాస్తా :** లింగాల ఘనపురం మండలంలోని కొత్తపల్లి శ్రీవేంకటేశ్వర చేనేత సహకార సంఘం నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం చైర్మన్‌గా చిటుకుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా బిట్ల ఆంజనేయులు, కార్యదర్శిగా కారంపూరి చంద్రయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గుమ్మడవెల్లి రవి, వంగ లక్ష్మి, భేతి చంద్రమౌళి, మహేశ్వరం భాగ్యమ్మ, కందగట్ల సుదర్శనం, వంగ సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి గ్రామ ప్రజలు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. నూతన పాలకవర్గం నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి సాధించి, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన చైర్మన్ చిటుకుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సభ్యుల సహకారంతో చేనేత రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఏకగ్రీవ ఎన్నికతో సభ్యుల మధ్య ఐకమత్యం మరింత బలపడిందన్నారు.

# విద్యార్థులను మీ పిల్లలుగా భావించండి

- కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- అత్యాధునిక సౌకర్యాల కల్పన, పౌష్టికాహారం
- విద్యార్థుల నమోదు పెరగాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా.. ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో అత్యాధునిక సౌకర్యాలు, అలాగే విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుందని ఇవన్ని ప్రతీ విద్యార్థికి అందేలా ఉపాధ్యయులు బాధ్యతగా వ్యవహారించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. పీఎం పోషణ, విద్యార్థుల నమోదు, విద్య కార్యక్రమాలు మొదలగు అంశాల మీద.. సమీకృత కలెక్టరెట్ లోని మినీ కాన్ఫెరెన్స్ హాల్ లో గురువారం మండల విద్య శాఖ అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లా లో జిల్లా విద్య శాఖ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహరం అందించేందుకు వివిధ రకాల వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నామన్నారు. వీటిని అన్నింటిని సరైన పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రగతి పోర్టల్ లో అప్లోడ్ చేయడం ద్వారా మిగతా ప్రాంతాల వారికి మార్గ దర్శకమా వుతామన్నారు. బడిబాట గురించి రివ్యూ చేస్తూ మండల వారీగా గత విద్య సంవత్సరం ఎంత ఉన్నారు. ఈ సంవత్సరం ఎంత మంది విద్యార్థులు నమోదు అయ్యారని కలెక్టర్ MEO లను అడిగి తెలుసుకున్నారు. బడి బాటలో నమోదు అయిన విద్యార్థుల వివరాలని UDISE పోర్టల్ లో త్వరగా అప్ లోడ్ చేయాలనీ ఎం ఐ ఎస్.. కో ఆర్డినేటర్ లను కలెక్టర్ ఆదేశించారు. ఈ విద్య సంవత్సరానికి 9000 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించేందుకు కృషి చేస్తామని అన్నీ మండలాల MEO లు కలెక్టర్ కి హామీ ఇచ్చారు. విద్య కార్యక్రమాల గురించి కలెక్టర్ మాట్లాడుతూ ఆన్ అకాడమీ, ఫాస్ట్ మాత్స్, విద్య ప్రణాళిక చట్రం, అభ్యాసన, మూల్యాంకన సాధనలను రూపొందించుకొని మొదలగు వాటి ద్వారా బోధన అభ్యాసన లో వినూత్న పద్ధతులను పాటిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తి తో ఉపాధ్యాయులు ముందుకు వెళ్తు... విద్య కార్యక్రమాలను, అత్యాధునిక సౌకర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాల లలో విద్యార్థుల నమోదు పెరిగేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ని, ఇస్తున్న ప్రాధాన్యతను క్షేత్ర స్థాయి లో చేర్చాలని, తద్వార మెరుగైన విద్య ప్రతీ ఒక్కరికి అందించాలని తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం పడకుండా విద్య శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తమ పిల్లలు గా భావించి, ప్రతీ నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. సమావేశం లో ఇంచార్జ్ ఏడీ శ్రీనివాస్, జీసీడీవో గౌసియా, ఎంఈవోలు పాల్గొన్నారు.



## సర్పంచుల ఆత్మగౌరవం కోసం

# ఐక్య పోరాటం చేద్దాం..

### జనగామ జిల్లా సర్పంచుల చైతన్య సదస్సు

**జనగామ, మన చౌరాస్తా :** సర్పంచుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని జిల్లా సర్పంచుల సంఘం కన్వీనర్ గోపగోని శ్రీధర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా సర్పంచుల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 లక్షలు, మైనర్ గ్రామపంచాయతీలకు రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామపంచాయతీలకు 50 శాతం నిధులు కేటాయించడంతో పాటు, మైనింగ్, స్టాంప్ డ్యూటీ ద్వారా వసూలయ్యే ఆదాయాన్ని గ్రామపంచాయతీలకు బదిలీ చేయాలని కోరారు. ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మాజీ చాంబర్ అధ్యక్షుడు మెట్టుపల్లి పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్‌రావు, రాష్ట్ర మాజీ ఎంపీపీ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడో సంపత్ నాయక్, జిల్లా సర్పంచులు పాల్గొన్నారు.

**అధ్యక్షుడిగా గోపగోని శ్రీధర్ గౌడ్ ఏకగ్రీవం**

జనగామ జిల్లాలో సర్పంచుల గళాన్ని బలంగా వినిపించేందుకు, వారి సమస్యలపై నిరంతరం పోరాడేందుకు జనగామ జిల్లా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపగోని శ్రీధర్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీధర్ గౌడ్ సమర్థత, నిబద్ధత సర్పంచుల సంక్షేమం పట్ల ఆయనకున్న తపనను గుర్తించి సదస్సులో పాల్గొన్న నాయకులందరూ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే పూర్తి స్థాయి జిల్లా కమిటీని ప్రకటిస్తామని పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ తెలిపారు.

## వృద్ధుల ఆరోగ్యంపై

# 'ప్రణామ్' ప్రత్యేక శ్రద్ధ

**జనగామ, మన చౌరాస్తా :** వృద్ధుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయరాదని ప్రముఖ వైద్యులు, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ డా. లవకుమార్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రం ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో గురువారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు అధ్యక్షతన జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ వయో వృద్ధుల సౌకర్యార్థం ప్రతి వారం ఒకప్రత్యేక వైద్య నిపుణుచే పరీక్షా శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న ప్రముఖ నరాల వాద్యులు డా. కె. రంజిత్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధులు ప్రత్యేకించి షుగర్ వ్యాధి ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మధుమేహం ఎగుడు దిగుడు జరిగే సందర్భాలలో నరాలకు సంబంధించిన వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని అన్నారు. శిబిరంలో పాల్గొన్న 36 మంది వయోవృద్ధులకు పరీక్షలు నిర్వహించి సలహాలు ఇచ్చి అవసరార్థులకు మందులు కూడా ఉచితంగా వితరణ చేశారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు అల్లాడి ప్రభాకర్ రావు, గాదె క్యాథరిన్, డా. చంద్రగిరి రాజమౌళి, పేర్వారం ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు పెద్ది హరిబాబు, జగదీశ్వర చారి, డా. జి. సీతారాం, ఎల్. శంకర్లింగం, కీర్తి నర్సయ్య, అల్లాడి మోహన్ రావు, మంగ బిక్షపతి, నీల మధుసూదన్, నీల వెంకటేశ్వర్లు, జిల్లా నారాయణ, మల్లం ప్రసాద్, చేటిపల్లి ఉమ, కన్న సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.




## మల్లయ్య మృతి ప్రభుత్వ హత్యే..

### కుటుంబానికి న్యాయం చేయాలి

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలో ఆత్మహత్య చేసుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పగిడిపల్లి మల్లయ్య కుటుంబాన్ని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ టీఎన్‌జీఓ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీ ప్రసాద్ పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందకపోవడంతోనే మల్లయ్య ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. మల్లయ్య కుటుంబానికి రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ఆలస్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సూసైడ్ నోట్‌ను ప్రదర్శిస్తూ ప్రభుత్వం వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని నిరసన తెలిపారు.

## 'కొడుకుల్లారా బుక్కెడు బువ్వ' టైటిల్ రిలీజ్



**జనగామ, మన చౌరాస్తా:** జెఎస్‌కే ట్యూన్స్ జనగామ సమర్పణలో రూపొందుతున్న 'కొడుకుల్లారా బుక్కెడు బువ్వ' జానపద గీతం టైటిల్‌ను గురువారం జనగామ పట్టణంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జెఎస్‌కే ట్యూన్స్ అధినేత, సంగీత దర్శకుడు చిలుమోజు సాయికిరణ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పట్ల పిల్లలకు ఉండాల్సిన ప్రేమ, బాధ్యతను గుర్తు చేసే సందేశాత్మక గీతంగా దీనిని రూపొందించినట్లు తెలిపారు. ఈ పాట ప్రోమోను శుక్రవారం సాయంత్రం విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి టైటిల్‌ను ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి మంచి సందేశాన్ని అందించే ఇటువంటి జానపద గీతాలను ప్రేక్షకులు ఆదరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవులు-కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి. కృష్ణ, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్, అభినందన సోషల్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి ఆయిల సోమనర్సింహాచారి, టీపా అధ్యక్షుడు తోలుపునూరి రామచంద్రం, దర్శకులు బొట్ల హరీష్, రాజు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని 22వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి పాల్గొన్నారు. బూత్‌లు 249, 250లో ఓటరు జాబితాను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలోని పొరపాట్లను సరిచేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గవ్వల సతీష్, బీఎల్‌వోలు రజిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

## ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జ్ ఆధితి



**జనగామ, మన చౌరాస్తా :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఈ నెల 21న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగే 'చలో ఢిల్లీ' ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జ్ ఆధితి పిలుపునిచ్చారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణక్క ఆదేశాల మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికే ఇందిర ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ సెక్రటరీ ఇన్‌చార్జ్ ఆధితి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆధితి మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ అమలుకు మద్దతుగా ఈ నెల 21న ఢిల్లీలో జరిగే ధర్నాలో జనగామ జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనాలని కోరారు. ప్రతి నెల నిర్వహించే సమీక్షా సమావేశాలకు కమిటీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. మహిళా రిజర్వేషన్ అమలుపై పోస్టుకార్డుల ద్వారా ప్రధానమంత్రి కార్యాలయానికి వినతులు పంపడంతో పాటు ఫోన్ ద్వారా కూడా తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులందరికీ అందేలా చూడాలని, మహిళా కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మున్నీ బేగం, ప్రధాన కార్యదర్శులు సక్కుబాయి, పద్మ, బ్లాక్ అధ్యక్షురాలు జక్కుల అనిత, మండల అధ్యక్షులు మాలతి రెడ్డి, శోభ, మణెమ్మ, వార్డు అధ్యక్షులు నవనీత, ధనలక్ష్మి, జోయా సుల్తానా, సౌమ్య, స్వరూప, ఉమారాణి, రెహానా బేగం, గ్రామ శాఖ అధ్యక్షులు అరుణ, లక్ష్మి, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



# మున్నూరు కాపుల సంక్షేమమే లక్ష్యం

## భీమదేవరపల్లి ప్రతినిధుల సన్మానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రాష్ట్రంలోని మున్నూరు కాపుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర మున్నూరు కాపు ఫెడరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో భీమదేవరపల్లి మండల మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ.. రాష్ట్ర మున్నూరు కాపు ఫెడరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు వర్గాల సంక్షేమం, అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపు సంఘాలను బలోపేతం చేసేందుకు త్వరలో మండల, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి సంఘ ప్రతినిధులతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు అరకాల అజయ్ కుమార్, గాజుల సతీష్, మెట్టు సికేందర్‌రావు, పొన్నాల మురళి, చిట్టెంపల్లి కిషన్, అరకాల విక్రమ్ కుమార్, నిమ్మచెట్టి సృజన్, రాయిని కుమారస్వామి, మద్ది సంపత్, ఎడ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో నాణ్యతకు ప్రాధాన్యం

## + సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించి నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్ సూచించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామపంచాయతీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమగ్ర గ్రామాభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శుల అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి ప్రణాళికల్లో పొందుపరచాలని సూచించారు. గ్రామాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ప్రణాళికల ద్వారానే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. శిక్షణలో గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అమలు, నిర్వహణతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలపై సర్పంచులు, కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి పంచాయతీ అధికారులు రవిబాబు, గంగాభవాని, ధర్మసాగర్, వేలేరు, ఆత్మకూర్ మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, చంద్రగిరి రవి, రంజిత్ కుమార్, మిషన్ భగీరథ సహాయ ఇంజినీరు, భీమదేవరపల్లి మండల అభివృద్ధి అధికారులు, ఆయా మండలాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

wanted
విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**